క్లుప్తంగా

వైద్యరంగానికి పెద్దపీట

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : పేదలకు వైద్య సేవలందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని 108 వాహనం తరుచూ రిపేర్లకు వస్తోందని నూతన అంబులెన్స్ వాహనాన్ని మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడానికి త్వరలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించనున్నట్లు తెలిపారు. నూతన అంబులెన్స్ వాహనాన్ని మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు

శాయంపేట : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంతో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తాలో గల రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది చేత తొలగింపజేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ లైటింగ్ పోల్స్ ఉన్న ఫ్లెక్సీలను సైతం తొలగించారు.

విజయవంతం చేయాలి



వేలేరు : బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కాశబోయిన దూడయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ రాజకీయ యుద్ధభేరి సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు ఉద్యోగాలు రావాలంటే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పొదుపు అలవర్చుకోవాలి



ఆత్మకూరు : ప్రతి ఒక్కరూ తమ జీవితంలో పొదుపును అలవర్చుకోవాలని చేయూత మహిళా పొదుపు సంఘం వ్యవస్థాపకుడు నీల రవీందర్ అన్నారు. మండలంలోని హౌజ్ బుజుర్గులో గురువారం చేయూత మహిళా పొదుపు సంఘం ద్వితీయ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పొదుపు సంఘం మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన సంఘం నూతన పాలక వర్గం ఎన్నికల్లో అధ్యక్షుడిగా నీల రవీందర్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ మౌలా, పాలకవర్గ సభ్యులుగా రాంబాబు, షేక్ హుస్సేన్ సయ్యద్, కరీం యాకూబ్, గుండెబోయిన రాజు, నీలం కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీసీసీబీ ఆత్మకూరు శాఖ మేనేజర్ హరిత, పంచాయతీ కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



ధర్మసాగర్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి, చిల్పూర్ దేవస్థానం మాజీ డైరెక్టర్ బొల్లెద్దు వికాస్‌రెడ్డి, గంటే రాజ్‌కుమార్, గోదల ప్రశాంత్, నారాయణగిరి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

ఎల్కతుర్తి : టైర్ పగిలి బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. దండేపల్లికి చెందిన జన్ను సుమలత-రాజు తమ కుమారుడు రితిక్ (9)ను తీసుకొని ఈనెల 26వ తేదీన ద్విచక్ర వాహనంపై దండేపల్లి నుంచి ఎల్కతుర్తి బ్యాంక్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ఎల్కతుర్తి గ్రామ పంచాయితీ స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు టైర్ పగిలిపోయి బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో చిన్నారి రితిక్‌కు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న రితిక్ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి సుమలత ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీఓ భవనం





పెచ్చులూడిన భవనం కప్పు

పెచ్చులూడుతున్నా..పట్టించుకోరా?

● భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్న కార్యాలయ సిబ్బంది

మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని 2006లో ప్రారంభించారు. కాగా భవనం కొంతకాలంగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడడంతో సిబ్బంది జంకుతున్నారు. భవనం పైన ఉన్న మీటింగ్ హాల్ మొత్తం పెచ్చులూడడంతో దానికి తాళం వేశారు. అలాగే ఎంపీపీ చాంబర్‌లో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. పక్కన ఉన్న మరో శిథిలమైన హాల్‌లోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిత్యం పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి ఎంపీడీఓ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు. అలాగే ప్రజాప్రతినిధులతో సర్వసభ్య సమావేశాలు జరుగుతాయి. మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడం ఎప్పుడు ఏమౌతుందోనని అక్కడ విధులు నిర్వర్తిసున్న సిబ్బంది, కార్యాలయానికి వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా భవనాన్ని తొలగించి, నూతన కార్యాలయ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భవనం శిథిలావస్థకు చేరిన విషయం పై ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - ఆత్మకూరు

పెండింగ్ వేతనాలు ఇప్పించండి



కమలాపూర్: వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది



దామెర: వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ సిబ్బంది

● ఎంపీడీఓకు ఉపాధిహామీ సిబ్బంది వినతి

కమలాపూర్ : పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇప్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది కోరుతూ గురువారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..మూడు నెలలుగా తమకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని, దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగలు కూడా సంతోషంగా జరుపుకోలేదన్నారు. గతంలో 20 రోజుల్లో ఇచ్చిన టార్గెట్లను రాత్రింబవళ్లు పనిచేసి పూర్తి చేసినప్పటికి పని చేసిన భరోసా లేకుండా పోయిందన్నారు. వెంటనే తమ వేతనాలు చెల్లించనిచో ఉద్యోగాలు చేసే పరిస్థితి లేదని వాపోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే నిరసనలతో తమ ఆవేదన వ్యక్తం చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తమకు పేస్కేల్ ఇస్తానని హామీ ఇచ్చి ఏడాది గడిచిందని, ఇప్పటి వరకు పేస్కేల్ అమలు కాలేదన్నారు. 2024, నవంబర్ నుంచి పెండిగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించి పేస్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, టీఏలు వెంకట్రాంరెడ్డి, మానస, శ్రీనివాస్, కొమురయ్య, ఎంసీఓలు ప్రవీణ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

దామెర : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వేతనాలు చెల్లించాలని ఈజీఎస్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయడంలో ఈజీఎస్ సిబ్బంది కృషిచేశారని పేర్కొన్నారు. మూడు నెలల వేతనాలు చెల్లించకపోవడంతో నిత్యావసరాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రి చొరవ తీసుకొని ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శారద, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రాములు

పరకాల : మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలో వెల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువ నాయకుడు పెండెల రాములును నియమించిన్నట్లు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ ఉద్యమం పట్ల అవగాహన, సామాజిక అంశాలపై బాధ్యత కలిగిన రాములును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియామకం చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే అన్ని మండలాల కమిటీలను పూర్తి చేసి జాతి ఐక్యత కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు సునీల్ పేర్కొన్నారు.

గాంధీ మార్గం ఆదర్శనీయం



పరకాల: గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్: పూలమాల వేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి



కమలాపూర్: పూలమాల వేస్తున్న ఆర్యవైశ్యులు

పరకాల : జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గం ఆదర్శనీయమని కాంగ్రెస్ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కొనియాడారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతి సమగ్రత, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీ మార్గం ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, కాంగ్రెస్ నాయకులు చిన్నాల గోపినాథ్, చందుపట్ల రాఘవరెడ్డి, పసుల రమేశ్, మార్క రఘుపతి గౌడ్, పబ్బ శ్రీనివాస్, లక్కం వసంత, ఉడుత అరుణ్, బొచ్చు జెమిని, గొట్టె రమేష్, దుప్పటి రాజేష్, మార్క రజనీకాంత్, ఎం.డీ అలీ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి

ఎల్కతుర్తి : గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ నాయకులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్ రావు, శీలం అనిల్, మండ సుమన్‌గౌడ్, బచ్చు బాబురావు, పాక రమేశ్, వెంకటరమణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి నివాళి

కమలాపూర్ : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వేర్వేరుగా గురువారం కమలాపూర్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య భవనంలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొనిశెట్టి మునీందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్, డైరెక్టర్లు జనగాని శివకృష్ణగౌడ్, గట్టు శ్రీధర్‌గౌడ్, మిల్కూరి శ్రీనివాస్, కిన్నెర కృష్ణమూర్తి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, నాయకులు బొల్లం రాజిరెడ్డి, పుల్లూరి శ్రీనివాసరావు, ప్రసాద్, అశోక్‌జీ, చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పున్నం చందర్, వీరభద్రయ్య, విజయ్‌కుమార్, శివశంకర్, రఘురాం, యుగేందర్, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి, వినుకొండ శంకరాచారి, మారెపల్లి రాజేందర్, మాదిరెడ్డి ప్రపంచ రెడ్డి, మారెపల్లి కట్టయ్య, వలుపదాసు రాము, వరదరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో..



శాయంపేటలో..

మిత్రుడి కుటుంబానికి చేయూత



కమలాపూర్ : మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి స్నేహితులు ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని అంబాల గ్రామానికి చెందిన రావుల పరమేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా పరమేశ్వర్‌తో కలిసి 1997-98లో పదో తరగతి చదివిన స్నేహితులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. దీంతో తలా కొంత చొప్పున విరాళాలు సేకరించి రూ.50 వేల నగదును పరమేశ్వర్ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. బాధిత కుటుంబానికి భవిష్యత్‌లోను అండగా ఉంటామని మిత్రులు హామీ ఇచ్చారు.

సంస్కారాన్ని అలవర్చుకోవాలి

● కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ధర్మసాగర్: విద్యార్థులు చక్కని సంస్కారాన్ని అలవర్చుకోవాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మండలంలోని పెద్దపెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ హనుమకొండ ఉభయ సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్దపెండ్యాల పాఠశాలలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు వచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి మాట్లాడుతూ.. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ఉపాధ్యాయులను కోరారు. హెచ్ఎం బత్తిని రాజేందర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్, సీడబ్ల్యూసీ సభ్యులు కజాంపురం దామోదర్, సీఎంఓ సుదర్శన్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, కార్యవర్గ సభ్యులు మార్క రవీందర్ గౌడ్, గంగారపు యాదగిరి, తాడూరి లక్ష్మీనారాయణ, ఎంఈఓ రాంధన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బత్తిని మమత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో నాలుగు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య చిత్రపటాలకు గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ మేరకు క్యాతంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసినందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నాలుగు పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు పూర్తిస్థాయిలో అమలు చేసి మంజూరు పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చాడ నర్సింహారెడ్డి, పిన్నపురెడ్డి అవనిజ విప్లవ్ కుమార్ రెడ్డి, పెరుమాండ్ల మహేందర్, సంపత్‌రెడ్డి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి..

దామెర : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. దీంతో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం కృషిచేసి సుప్రీం కోర్టు ద్వారా తీర్పు సాధించిన గొప్ప ఉద్యమనేత అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల శ్రీనివాస్, రాజ్‌కుమార్, దామెర రమేష్, ప్రసాద్, కుమారస్వామి, ఈరెల్లి హరీష్, కొడకండ్ల శ్రీనివాస్, ప్రశాంత్, నక్క రాజేందర్, మొగిలి, నవీన్, రాజు, చిరంజీవి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి

● నిరసనగా గాంధీ విగ్రహానికి వినతి



ధర్మసాగర్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ధర్మసాగర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 420 రోజులైన వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు గడుస్తున్నా ఎన్నికల ముందు అలవిగాని ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వారు వినతిపత్రం అందచేశారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందడానికే నాలుగు పథకాలు అమలు విషయం తెరపైకి తెచ్చారని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత మాటలు నమ్మే స్థితిలో లేరని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కర్ర సోమిరెడ్డి, నాయకులు బొడ్డు ప్రభుదాస్, లాల్‌మహ్మద్, లక్క శ్రీనివాస్, బొడ్డు ప్రతాప్, శాతవేయిన రమేశ్, విజయ్, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్న ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు నెరవేర్చలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం భీమదేవరపల్లి మండలంతో పాటు ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామంలో గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇచ్చిన వాగ్దానాలు పూర్తిస్థాయిలో నెరవేర్చాలని డిమాండ్‌చేస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిట్టల మహేందర్, శ్రీపతి రవీందర్‌గౌడ్, తంగెడ మహేందర్, కుర్ర సాంబమూర్తి, కొంరెల్లి, శేషగిరి, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలు అమలు చేయాలి

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాల హామీలకు గ్యారంటీ లేకుండా పోయిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ విమర్శించారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మారెపల్లి నందం, పాడిశెట్టి గణేష్, పసుల ప్రవీణ్‌కుమార్, రమేష్, సుమన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా రూ.15వేలకు బదులు రూ.12 వేలు ఇస్తామని అవి కూడా అన్ని గ్రామాలకు ఇవ్వకుండా కేవలం మండలంలో ఒక్క గ్రామానికే ఇచ్చి మిగితా రైతులకు మొండిచేయి చూపారని విమర్శించారు. కౌలు రైతులకు, భూమిలేని పేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, వీరయ్య, నాయకులు జానీ, విజేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కిరణ్, బత్తుల శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి: దండేపల్లిలో..

ఐనవోలు : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి శాంతియుత నిరసన తెలుపుతూ మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు, నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రైతుబంధును ఇవ్వకుండా మోసం చేస్తోందని అలాగే పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయలేదని విమర్శించారు. నేతన్నలకు చేయూత, మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, వృద్ధులకు పెన్షన్ల పెంపు వంటి ఎన్నో హామీలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. మండల నాయకులు ఉస్మాన్ అలీ, మామిండ్ల సంపత్, కడుదూరి రాజు, జక్కుల రాజు, తాటికాయల కుమార్, రాజు, రఘువంశీ, రాజు, రాములు, ప్రతాప్, అజయ్, రఘుపతి, కొంరయ్య, రవి, ప్రవీణ్, దిలీప్, మహేష్, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.



వేలేరులో..



శాయంపేటలో..



ఐనవోలులో..

కౌమార విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రాజేష్‌కుమార్

దామెర : విద్యార్థులు, యువకులు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఎంఈఓ లకావత్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కౌమార విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కౌమార దశలో వచ్చే మార్పులు వాటిని ఎలా జయించాలో తెలియజేశారు. సర్వోదయ సంస్థ ప్రతినిధి ఇందిర మాట్లాడుతూ సెల్ ఫోన్ ద్వారా చెడు అలవాట్లకు ఆకర్శితులవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కుష్ఠు వ్యాధి అని భయపడొద్దు'



పరకాల: మాట్లాడుతున్న రాయపర్తి పీహెచ్‌సీ సూపరింటెండెంట్ దివ్య

పరకాల/నడికూడ : కుష్ఠు వ్యాధి అనగానే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ దివ్య అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా పరకాల మండలం నాగారం గ్రామంలో, నడికూడ మండల కేంద్రంతో పాటు రాయపర్తి గ్రామ ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి దివ్య, డాక్టర్ అనూహ్య మాట్లాడారు. తెల్లని స్పర్శ లేని మొద్దుబారిన మచ్చలు ఉంటే స్థానిక వైద్యసిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్లు సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.